# స్టాండ్ బై

డోర్ తోసుకుని స్టూడియోలోకి అడుగుపెట్టింది శశికళ. బరువుగా, మెత్తగా స్ప్రింగ్‌డోర్ మూసుకుంది. పక్క స్టేషన్ నుండి వస్తున్న కార్యక్రమం రిలే అవుతోంది. శశికళ చేతిలో టేపులు డెక్ మీద పెట్టి క్యూషీట్ చూసుకుంది. ఇది పూర్తవగానే ప్రసారం చెయ్యాల్సిన కార్యక్రమంలో వేయాల్సిన పాట డిస్క్ తీసుకుని చూసింది.

"ప్రేమంటే తెలుసా నీకు?"

అంతవరకు ఆ పాట రికార్డు చూసినా, విన్నా నవ్వుకునేది. కానీ ఈవేళ దుఃఖంగా, కోపంగా కసిగా మనసు విలవిల్లాడిపోయింది. నిజంగా ప్రేమంటే ఏమిటి? కంటికి కనిపించకుండా వంచించి బాధించే ఆ ప్రేమ అనేది ఎక్కడుందో ఎవరికి తెలుసు? అసలుందో లేదో అనుకోటానికి వీల్లేకుండా ఎప్పుడూ వున్నానంటూ ఏడిపించుకు తింటుంది. ప్రేమంటే తెలుసా నీకు అంటూ గొంతు చించుకుంటే తెలీదని ఎవరనగలరు పోనీ తెలుసునని మాత్రం ఎవరు చెప్పగలరు?

రిలే కార్యక్రమం ముగింపు కొచ్చింది. అది కట్ అయి రెడ్ లైట్ వెలగంగానే ఫెడర్ తీసి ఆకాశవాణి... కేంద్రం ఇప్పుడు ... కార్యక్రమం వింటారు అని సిగ్నేచర్ మ్యూజిక్ వేసి తల విదిలించుకుంది శశికళ.

ఈ మధ్యనే రేడియోలో ఎనౌన్సర్‌గా వుద్యోగంలో చేరింది శశికళ చేరిన్పటి నుండి, కొత్త జీవితం, కొత్త ఆశలు – జీవితం ఉత్సాహంగా ముందుకు కదులుతుంటే నలుగురిలో తనకీ గౌరవం, విలువ వున్నాయనీ, తను తనుగానే బ్రతకగలదని ఆత్మస్థయిర్యంతో రోజులు గడుపుతోంది శశికళ.

మూడేళ్ళ పిల్లగా వున్నప్పుడు పోలియోవల్ల లాగేసిన కాలు శశికళలో వున్న అందమందంతా బూడిదలో పోసిన పన్నీరు చేసింది. దానికి తగ్గట్టుగా చిన్నప్పటి నుంచి అంతా చూపించే సానుభూతి, జాలి మనసుకి అవమానంతో చిన్నబుచ్చేవి. అలాంటి జాలిమాటలు వింటుంటే ఆమెకి చాలా చిరాకుగా వుండేది. అన్నిటికి మించిన అవమానం "అసలే ఆడపిల్ల – పాపం! కళ్యాణయోగం వున్నట్టు లేదు" అని కొందరు ముఖంమీదే అంటుంటే భరించలేకపోయేది. అయినా భరిస్తూ, కసిగా చదువుతూ అన్ని క్లాసులూ మంచి మార్కులతో ప్యాసయింది. కాలు వంకరైనా కలలుగనే వయసుకి మనసుకి కొదవలేకుండా ఎన్నో రంగుల కలలు కనేది.

రాజాతో పరిచయం. అతను తనయందు చూపుతున్న ప్రేమానురాగాలకు శశికళ పేదమనసు ఉబ్బితబ్బిబ్బయిపోయింది. నిజానికి తనకి కాలు వంకర. తన నడక ఎత్తి ఎత్తివేస్తున్న అడుగులతో అవకరంగా కనిపిస్తుంది. కాని తన నడతలోని నిశ్చలత గొప్పతనం ఎవరైనా ఎప్పుడైనా గుర్తించి, అర్థం చేసుకోకపోతారా అని ఊహించుకునేది. ఇన్నాళ్ళకి తన కలలు నిజమయ్యాయని ఆ రోజు మురిసిపోయింది.

రాజాతో పరిచయమైన కొత్తలో ఎంత పులకించిపోయింది తను? తనకి తెలియకుండానే రోజు రోజూ పరిచయం పెరిగిపోయింది. ఇంట్లో ఎవ్వరూ గ్రహించని విధంగా తనే చాలా జాగ్రత్తపడింది. వాళ్ళకి తెలిస్తే మందలిస్తారని కాదు హేళన చేస్తారు. మొదట తల్లే సణుగుడు మొదలు పెడుతుంది.

"అందని ఆశలకి పోక – నీదారిన నువ్వుండు దేనికైనా నుదుటి రాత, యోగ్యతా వుండాలి" అంటూ సాగదీస్తుంది. ఆ విదిలింపు, ఆ వైరాగ్యపు ధోరణి శశికళని నిలువునా కృంగదీస్తుంటాయి.

అయినా రాజాతో తనకి స్నేహం అపురూపంగా భావించుకుంది ఆనందపడి పోయింది.

ఫైనలియర్ పరీక్షల సమయంలో ఏదో నోట్‌బుక్ కోసం విమల యింటికి వెళ్ళినప్పుడు రాజాని తను మొదటిసారి కలుసుకుంది. ఎన్నో కబుర్లు, జోక్స్, క్షణాలు, గంటలు తెలీకుండా గడిచిపోయేవి. అతని సాంగత్యంలో అపురూపమైన ఆనందం అనుభవించేది. ప్రపంచాన్ని జయించిన తృప్తి, దేవుడు రాసిన నుదుటిరాతను చెరిపేసిన విశ్వాసం అదృష్టాన్ని ఆపేవారెవరూ లేరనే ఆశ. ఆమెలో క్షణ క్షణం ఊపిరిలో కలిసి వృక్షాలుగా మారిపోయాయి.

ఆ రోజు రాగిణి కడపనుంచి వచ్చినప్పుడు తను ఎంతోఆనందపడిపోయింది. నిజానికి రాగిణి మామయ్య కూతురైన సొంత అక్కాచెల్లెళ్ళకంటే తనకి దగ్గర. తనంటే ప్రాణం పెడుతుంది. తనని తక్కువగా జాలిగా చూడదు. సమానంగా చూస్తుంది.

ఆ రోజు సాయంత్రం రాగిణిని రాజాకి చూపించి పరిచయం చేసేవరకూ శశికళ ఒక్క నిముషం నిలువలేకపోయింది.

ముగ్గురూ కలిసి ఎన్ని చోట్లకని తిరిగారనీ – ? హొటళ్ళు, షికార్లు సినిమాలు ఒకటేమిటి? ఎన్ని చర్చలు? ఎన్ని వాద ప్రతివాదాలూ? ఎన్ని సినిమా కధలు? ఎన్ని చెత్త నవలలు? ఎన్ని ఆశయాలు ఒకటేమిటి? ఆ రోజు తను భూమికి గజం ఎత్తులో గాలిలో నడిచింది పక్కన రాగిణి వుండటంతో శశికళ మరీ స్వేచ్ఛగా ప్రవర్తించింది. ఎవరో చూస్తున్నారన్న భయం లేకండా ప్రపంచాన్ని జయించిన అనుభూతి పొందింది. ఆ రోజు గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది.

వారం రోజులు రాగిణి వున్నప్పుడు ఏ రోజు కారోజు రాజా తనని ప్రేమిస్తున్నాడనీ, పెళ్ళిచేసుకోబోతున్నాడనీ చెప్దామనుకుంటూనే గడిపేసింది. తనలోని సిగ్గు, ఆడతనం ఆ మాటలు చెప్పనీయలేదు. ఆమె వెళ్ళగానే ఉత్తరం రాద్దామనుకుంది.

రాగిణి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన నాటినుండి, రాత్రిమంచంమీద వెల్లికిలా పడుకుని ఎన్నో ఉత్తరాలు ఆమెకి రాస్తున్నట్లు వూహించుకుంటూ వుర్రూతలూగింది – ఏ రోజు కారోజు రేపు రేపు అనుకుంటూనే వుండిపోయింది.

తీరా నెల్లాళ్ళు తిరిగేసరికి మావయ్య ఊడిపడ్డాడు. వస్తూనే మామయ్య అన్న మాటలకి స్థాణువులా వుండిపోయింది.

"ఏమే! ఆ రాజారావనే కుర్రవాడు మంచివాడేనా? నీకు తెలుసటగా" అని – తర్వాత మాటలు విని శశికళ నిశ్శబ్దంగా వుండిపోయింది. కథ తిరగబోయే మలుపుకి తను ఇరుసుగా నిలబడి నట్లనిపించింది.

తను పెద్దగా సిఫార్సు చెయ్యాల్సిన పనేమీ లేదని గ్రహించింది. మనసులో మారుమూల ఆశ తళుకుమంటోంది. రాజా ఈ విషయం విని తుళ్ళిపడతాడు. "లేదు లేదు నా మనసెప్పుడో శశికళకి అంకితమై పోయింద" ని చెప్పినప్పుడు ఈ మావయ్యతోబాటుగా, ఇంట్లో వారందరి ముఖాలూ చూడాలని సరదా పడింది. కాని సాయంత్రం మావయ్య తిరిగివచ్చి చెప్పినదాన్ని బట్టి నిశ్చేష్టయిపోయింది. మావయ్య రాజా గుణగణాల్ని నిలువెల్లా పొగుడుతుంటే తన గుండెల్లో రేగిన మంటలకి విలవిల్లాడిపోయింది.

తన కళ్ళముందే రాగినీ, రాజాకి పెళ్ళి కుదిరిపోయింది. ఆ సాయంత్రం తను ఆవేశంతో దుఃఖంతో రాజాని కలిసింది. మాటలతో కడిగేసింది.

"నువ్వెందుకు బాధపడుతున్నావో నాకర్థం కావడంలేదు. బాధపడాల్సింది ఇందులో ఏమీ లేదు. నీ అందం చదువు చూసి నిన్ను ప్రేమిద్దామనుకున్నాను. నీ అవకరాన్ని పక్కకి పెట్టి పెళ్ళిచేసుకుందామనుకున్నాను. నీ అవకరాన్ని బట్టయినా నీకు మంచి వుద్యోగం వస్తుందని తెలుసు. వచ్చింది కూడా – నీ కన్నా అన్నివిధాలా అధికురాలు నన్ను వలచి వస్తే ఆమెని ఎన్నుకోవడంలో నా తప్పేమిటో నాకు తెలియడం లేదు – నిజానికి నీమీద నా మోజు తీరనేలేదు. నిన్ను వదిలేయను. మన మైత్రి యిలాగే కొనసాగుతుంది. నా మనిషిగా నిన్ను వుంచుకుంటాను" అతని మాటలు పూర్తవుతుంటేనే.

"ఛీ! సిగ్గులేదూ అలాంటి మాట లనడానికి" అంటూ ఒక్క క్షణం అక్కడ నిలబడకుండా వచ్చేసింది.

"ప్రేమిద్దామనుకున్నా" అన్న మాటలు ఆమె హృదయాన్ని తూట్లు పరిచాయి. ఇంతకాలం ప్రేమించలేదా? చేసిన వాగ్దానాలన్నీ సరదా కబుర్లా? లేక మోసకారి మాటలా? ఇది పచ్చిమోసం, దగా, కానీ ఏ న్యాయస్థానం దీనికి న్యాయ నిర్ణయం చెయ్యలేదు. పగిలిన తన హృదయానికి జరిమానా కట్టించలేదు. కారాగార శిక్షా విధించలేదు. కనీసం ఎవరితోనైనా చెప్పుకున్నా తప్పు తనదే అంటారు. అది మరింత దుఃఖం.

తనతో ప్రేమ కలాపాలు సాగిస్తూనే రాగిణితో ప్రేమలేఖలు నడిపించి దానికి ప్రేమని పేరు పెట్టాడు. తనీ విషయం రాగిణికి ఎలా చెప్తుంది. తన ప్రాణంలో ప్రాణంగా మసలిన రాగిణి యిప్పుడు రాజా మైకంలో తనని అపార్థం చేసుకున్నా చేసుకోవచ్చు. అయినా తను అవమాన భారంతో కృంగిపోయి వుంది. ఎవరికీ ఫిర్యాదు చేసుకునే ఓపిక కూడా లేదు.

రాగిణి వివాహం పూర్తయిన తర్వాత మిత్రుల కిచ్చిన పార్టీలో వారిద్దరిదీ ప్రేమ వివాహంగా వర్ణిస్తుంటే ఆశ్చర్యపోతూ, ఆవేదన పడిపోతూ వూరుకుండిపోయింది.

పాట అయిపోయింది – తరువాత కార్యక్రమం ఎనౌన్సు చేసి, టేపు ఆన్‌చేసింది.

ఇంతలో ఎవరో డోర్ తీసుకొచ్చారు. చటుక్కున చూసింది. మదన్. లేని నవ్వు తెచ్చుకుని విష్ చేసింది.

"శశికళగారూ! రేపు ఓ బి. ప్రోగ్రాముకి మీరు నాకు అసిస్టెంట్. ఆ నెమలిపాట, డ్యాన్సుకోసం చేశాం చూడండి, అది రెండు టేపుల మీద డబ్ చెయ్యండి"

"రెండా?"

"అవునండీ స్టాండ్ బై టేపు లేకుండా వుంటే మునిగిపోతాం - స్టాండ్‌బై - కోసం" అన్నాడతను నవ్వుతూ - ఆ నవ్వులో ఏదో అర్థం - ఇద్దరు బిడ్డల తండ్రి సలక్షణమైన భార్య వున్నతనికి స్టాండ్‌బై కావాలి. "అలాగేనండి సాయంత్రం చేస్తాను" అంది నెమ్మదిగా. మదన్ తప్పేముంది. సాధారణంగా మగాళ్ళందరికీ స్టాండ్ బై కావాలి మరి.

శశికళ విషాదంగా నవ్వుకుంది. రేడియోలోనే కాదు జీవితంలో కూడా స్టాండ్ బై పెట్టుకోవాల్సిన రోజులివి - అనుకుంది.

●